సాక్షి
తిరుపతి
సోమవారం । 11 । మార్చి । 2024



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్, మంత్రి విడదల రజిని, లక్ష్మీపార్వతి, బాలినేని, మోపిదేవి, బీద మస్తాన్‌రావు తదితరులు





బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం నిర్వహించిన సిద్ధం బహిరంగ సభకు పోటెత్తిన జనసందోహంలో ఓ భాగం (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జయ జయ జయహో..



మా నమ్మకం నువ్వే అన్నా: సిద్ధం పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న యువత



కెవ్వు కేక : సమరానికి సిద్ధమంటూ విజిలేస్తున్న మహిళ



ఓ అన్నా.. నీవెంటే మేమంటూ నినదిస్తున్న యువతి

సైన్యంలా...ఓ శాసనంలా
ఊళ్లన్నీ ఒక్కటిగా.. జనమంతా ఐక్యంగా
జన చేతన పొంగిన సంద్రంలా
కొత్త ఒరవడికి శ్రీకారంలా...
భూదేవి నుదుట దిద్దిన సిందూరంలా
మహోజ్వల ఘట్టానికి మలి మెట్టులా
సువర్ణ అధ్యాయానికి జన సంతకంలా
చరిత్ర పుటల్లో తమకంటూ ఓ పేజీలా
సమరోత్సాహంతో...సమధికోత్సాహంతో...
కదనరంగానికి దుమికినట్టు..
కార్యోన్ముఖులై కదిలినట్టు
జన సారథి వెంట జనవారధి కట్టినట్టు
రాజన్న బిడ్డ పాలన మళ్లీ రావాలంటూ
అభివృద్ధే లక్ష్యంగా.. సంక్షేమమే సాక్ష్యంగా
గడప గడప నుంచి.. పల్లె పల్లె నుంచి
జన సమూహాలు జన సందోహాలు
సిద్ధం సభకు తరలి వచ్చిన తీరు
మరో మహోద్యమాన్ని తలపించింది..
రేపటి భవితను సాక్షాత్కరించింది.

సిద్ధం సభ జన సంద్రం

- అన్నిదారులూ బాపట్ల జిల్లా మేదరమెట్ల వైపే..
- ఉదయం నుంచే సభాస్థలికి తరలివచ్చిన జనసందోహం
- లక్షలాదిగా కదిలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు
- జనసంద్రంగా మారిన సభా ప్రాంగణం
- వందలాది ఎకరాలతోపాటు స్తంభించిన జాతీయ రహదారి
- సీఎం వైఎస్ జగన్ ప్రసంగంతో ఆద్యంతం హోరెత్తిన జనస్పందన
- నిన్ను మళ్లీ గెలిపించుకునేందుకు సిద్ధం అంటూ నినదించిన జనం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద ఆదివారం జరిగిన సిద్ధం సభ జనంతో పోటెత్తింది. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో నిర్వహించిన ఈ సభకు ఆయా జిల్లాలనుంచి జనం లక్షలాదిగా తరలివచ్చారు. మధ్యాహ్నం తరువాత సభ జరగాల్సి ఉన్నా ఉదయం 9 గంటలనుంచే జనం సభా ప్రారంభానికి చేరుకోవడం ప్రారంభమైంది. 11 గంటల ప్రాంతానికి మేదరమెట్ల సమీపంలోని జాతీయ రహదారివద్ద వందలాది ఎకరాల్లో సిద్ధం చేసిన సిద్ధం సభా ప్రాంగణం జనంతో నిండి పోయింది. సమీపంలోని పొలాలతోపాటు పక్కనే ఉన్న చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి సైతం సభకు వచ్చిన జనంతో కనుచూపుమేర జనసంద్రంగా మారింది. ఈ రహదారిలో మేదరమెట్ల నుంచి రేణంగివరం వరకు 18 కిలోమీటర్ల వరకు రోడ్డు జనంతో కిక్కిరిసి పోయింది. మరోవైపు మేదరమెట్ల నుంచి అద్దంకి వరకు (హైదరాబాద్) ప్రధాన రహదారి జనసంద్రంగా మారింది. పిల్లలు, యువత, మధ్యవయస్కులు, వృద్ధులు, మహిళలు అన్నతేడా లేకుండా అన్నివర్గాలవారు వైఎస్సార్ సీపీ జెండాలు చేబూని సభకు తరలివచ్చారు. రాష్ట్రం నలుమూలలకు వినిపించేలా జై జగన్ అన్న సభికుల నినాదాలు సభలో హోరెత్తించాయి.



ప్రజల మధ్యకు వచ్చి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

రెండు సార్లు బటన్ నొక్కేందుకు సిద్ధం..

58 నెలల్లో మీ బిడ్డ మీ కోసం 130 సార్లు బటన్‌నొక్కి రూ. 2.70 లక్షల కోట్లు మీ ఖాతాల్లో వేశానని, నా కోసం మీరు రెండు బటన్లు నొక్కలేరా అనగానే నొక్కుతాం....నొక్కుతాం అంటూ పెద్ద ఎత్తున ప్రతిధ్వనించారు. మీ బిడ్డకు ఓటేస్తే అన్ని పథకాలు అందుతాయని, బాబుకు ఓటేస్తే చంద్రముఖిని మనమే వెళ్లి నిద్రలేపి ఇంటికి తెచ్చుకున్నట్లేనని జగన్ అనడంతో అవును... అవును...అంటూ ప్రజలు స్పందించారు. 2019 మించి 175 కు 175 ఎమ్మెల్యేలు, 25 కు 25 ఎంపీలు గెలవడానికి మనమంతా సిద్ధమేనా అనగానే సిద్ధం..సిద్ధం అంటూ జనం హోరెత్తించారు. త్వరలోనే మేనిఫెస్టో ప్రకటిస్తానని, జగన్ మాట ఇచ్చాడంటే తగ్గేదేలే అంటూ అనగానే జనం ఈలలు, కేకలతో సభ దద్దరిల్లింది. మళ్లీ నిన్నే గెలిపించుకుంటామంటూ ప్రతిస్పందించారు. ప్రతిపక్షాలపై విమర్శలు బాణాలు సంధించినప్పుడు జనంలో ఉత్సాహంతో కూడిన ప్రతిస్పందన కనిపించింది. ఈ ఎన్నికల్లో వారి అంతు తేలుస్తామంటూ జనం ఆగ్రహంతో ఊగిపోయారు. కుట్రలు, కుతంత్రాలకు ముగింపు పలుకుతామంటూ నినదించారు. సభ ఆద్యంతం సీఎం...సీఎం అంటూ హోరెత్తించారు.ఈ సభలో మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, మేరుగ నాగార్జున, ఎంపీలు విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణారావు, కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు బాలినేని శ్రీనివాసరెడ్డి, కరణం బలరాం కృష్ణమూర్తి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కోన రఘుపతి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, నియోజకవర్గ సమన్వయకర్తలు పానెం చిన హనిమిరెడ్డి, కరణం వెంకటేష్, యడం బాలాజీ, ఈవూరి గణేష్, వరికూటి అశోక్, వైవీ భద్రా రెడ్డి పాల్గొన్నారు.





ర్యాంపు వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్



నేను సైతం..

అపూర్వ స్పందన..

సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు చేరుకున్నారు. తర్వాత సభావేదిక మీదకు చేరుకున్న ముఖ్యమంత్రి 4.47 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించి, 5.56 గంటలకు ప్రసంగాన్ని ముగించారు. ముఖ్యమంత్రి ప్రసంగం ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. ఆయన ప్రతిమాటా తూటాలా పేలింది. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకోసం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి సూటిగా జనం ముందుంచారు. పథకాలతో జనానికి జరిగిన మేలును గణాంకాల రూపంలో వివరించారు. ముఖ్యంగా పేదవర్గాల జీవన ప్రమాణాలు ఎలా మెరుగు పడ్డాయో తెలియ జెప్పారు. ప్రతిపక్షనేత చంద్రబాబు, జనసేన నేత పవన్‌కల్యాణ్, రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న కుట్రలను ప్రజల ముందు బట్టబయలు చేశారు. ప్రతిపక్షాలపై జగన్ విరుచుకు పడటంతో జగన్ గొంతులో గొంతు కలిపి తమదైన శైలిలో మద్దతు పలికారు. మరో ఐదేళ్లు ఈ ప్రభుత్వం కొనసాగాలంటే మీరు మద్దతు పలికేందుకు సిద్ధమా.? అనడంతో సిద్ధం..సిద్ధం అంటూ జనం ఈలలు, కేకలతో స్పందించారు. 'జగన్ సీఎం...సీఎం' అంటూ నినాదాలు చేశారు. పేదవాడి భవిష్యత్తు కాపాడేందుకు నాతో కలిసి రావడానికి మీరు సిద్ధమా...? అని సీఎం అనగానే సిద్ధం అంటూ జనం ప్రతిస్పందించారు. పార్టీలతో బాబు....ప్రజలతో మనం ఈ సంగ్రామానికి జనం సిద్ధమా... అనగానే సిద్ధం ...సిద్ధం అంటూ హోరెత్తించారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర సిద్ధం..., ఉత్తర కోస్తా సిద్ధం, రాయలసీమ సిద్ధం... తాజాగా దక్షిణ కోస్తా సిద్ధం అంటూ జగన్ అనగానే సిద్ధం...సిద్ధం అంటూ ప్రజలు ప్రతిధ్వనించారు.

ఆయుధాలు ప్రయోగించాల్సిన సమయం ఆసన్నం..

ఈ యుద్ధంలో మీది శ్రీకృష్ణుడి పాత్ర, నాది అర్జునుడి పాత్ర, దుష్టులపై ఆయుధాలు ప్రయోగించాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకే జమ్మిచెట్టుపై నుంచి ఆయుధాలు దింపాల్సిన సమయం ఆసన్నమైందంటూ జగన్ భారతాన్ని ఉటంకించడంతో జనం కేరింతలు కొట్టారు. చంద్రబాబు లాగా మనకు 10 మంది నటించే పొలిటికల్ యాక్టర్లు లేరు....రకరకాల పార్టీలతో పొత్తులు లేవు. అందుకే ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తున్నాను. మీ బిడ్డకు మీరే స్టార్ క్యాంపెయినర్లు. ప్రతిపక్ష పార్టీలో సైన్యాధిపతులు తప్ప సైన్యం లేదని 5 కోట్ల మంది సైన్యం అండదండలతో మనం సిద్ధం అని ముఖ్యమంత్రి అనగానే జనం ఈలలు, కేకలతో స్పందించారు. చంద్రబాబుకు దోచుకునేందుకు, దాచుకునేందుకే అధికారం కావాలని జగన్ అనడంతో జనం అవును...అవును అంటూ నినదించారు.





సిద్ధం సభకు తరలివచ్చిన పల్లె ప్రజానీకం



సిద్ధం సభ వద్ద యువత కేరింత

సుపరిపాలన కొనసాగాలని పూజలు



పూజాసామగ్రితో వస్తున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మురళీధర్

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామివారికి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ విశేష పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన కొనసాగాలని స్వామివారిని ప్రార్థించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఎంపీ, ఎమ్మెల్సీకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి పేరిట అర్చన, అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ తాతా శ్రీనివాసు లు, ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి, ఉడతా శ్రీనివాసులు పాల్గొన్నారు.

చెంగాళమ్మతల్లికి స్వర్ణహారం



లక్ష్మీ కాసుల హారం అందిస్తున్న దాతలు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మపరమేశ్వరి అమ్మవారికి చెన్నైకి చెందిన డాక్టర్ కె.సతీష్ శ్రీనివాస కుటుంబసభ్యులు 34 గ్రాములు బంగారు లక్ష్మీకాసుల హారాన్ని విరాళంగా అందించారు. ఆదివారం ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కర్లపూడి సురేష్‌బాబు చేతులమీదుగా అందజేశారు. అలాగే ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సూళ్లూరుపేటకే చెందిన మొగళ్లూరు బాలసుబ్రమణ్యం కుటుంబసభ్యులు రూ.65 వేలు అందించారు.

రేణిగుంట రైల్వే స్టేషన్ పరిశీలన



పరిశీలిస్తున్న డీఆర్‌ఎం వినీత్‌సింగ్

రేణిగుంట: రేణిగుంట రైల్వే జంక్షన్‌ను ఆదివారం సాయంత్రం గుంతకల్ డీఆర్‌ఎం వినీత్‌సింగ్ పరిశీలించారు. ప్రయాణీకులకు కల్పించిన వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తిరుపతి అంతర్జాతీయ స్థాయి రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, నిర్దేశిత సమయంలోపే పూర్తి చేస్తామన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్ ముందు మల్టీ లెవల్ పార్కింగ్ పనులు కూడా జరుగుతున్నట్లు వివరించారు. వన్ స్టేషన్- వన్ ప్రొడక్ట్స్ కింద గుంతకల్ డివిజన్ పరిధిలోని 23 స్టేషన్లలో స్థానిక ఉత్పత్తుల విక్రయాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 12వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ పలు రైల్వే ప్రాజెక్టులు, అదనపు రైళ్లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గుంటూరు- గుంతకల్ మార్గంలో డబ్లింగ్ ట్రాక్ ఏర్పాటు, ఏర్పేడు ఐఐటీ, నేషనల్ హైవే కనెక్టింగ్ పనులు కూడా జరుగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఓఎం శ్రవణన్, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ముక్కంటి మురిసె.. అమ్మణ్ణి మెరిసె!

- కనులపండువగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- దివ్యతేజస్సుతో అలరారుతున్న దక్షిణ కైలాసం
- కమనీయంగా శివపార్వతుల కల్యాణం

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ క్రమంలో పట్టణ నడిబొడ్డులోని పెండ్లి మండపాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. విశేష రంగువల్లులతో వీధులను అలంకరించారు. వివాహ ఘట్టంలో భాగంగా ముక్కంటి ఆలయంలో నూతన వధూవరులను ముస్తాబు చేశారు. ప్రధానార్చకులు యాగశాల వద్ద స్వామి అమ్మవార్ల బుగ్గలపై చుక్కలు పెట్టి కల్యాణ వేదికకు ఊరేగింపుగా సాగనంపారు. కళాబృందాలు, మంగళవాయిద్యాల నడుమ గజ వాహనంపై స్వామి, సింహవాహనంపై అమ్మవారు అధిష్ఠించి కనులపండువగా అలంకరించిన మాడవీధుల్లో విహరిస్తూ పెండ్లి మండపానికి వేంచేపు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక హారతులు సమర్పించారు. ఆదిదంపతులు కల్యాణోత్సవ ఘట్టం వీక్షించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేశారు.



అధికార నంది, కామధేను వాహనాలపై స్వామి, అమ్మవారు



కల్యాణోత్సవానికి వేంచేస్తున్న శివపార్వతులు

వైభవంగా నందివాహన సేవ

కల్యాణోత్సవం సందర్భంగా వాయులింగేశ్వరుడు ఆదివారం ఉదయం అధికార నందిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అమ్మవారు కామధేనువుపై దర్శనమిచ్చారు. చతుర్మాడ వీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లలకు పురజనులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ సారె సమర్పణ

విజయవాడ కనక దుర్గమ్మ ఆలయం తరపున ఈఓ రామారావు, పాలక మండలి చైర్మన్ సారె సమర్పించారు. ముక్కంటి ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు స్వీకరించారు.

వరసిద్ధుని పట్టువస్త్రాలు

కాణిపాకం ఆలయం తరఫున ముక్కంటికి పట్టువస్త్రాలను పాలకమండలి చైర్మన్ మోహన్‌రెడ్డి దంపతులు, ఈఓ రాణాప్రతాప్ దంపతులు సమర్పించారు.

శివయ్యకు శ్రీవారి సారె

తిరుమల శ్రీవారి తరపున శ్రీకాళహస్తీశ్వరునికి టీడీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి సారె సమర్పించారు. పట్టణంలోని దేవాంగుల మండపం వద్ద ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు ఘనంగా స్వాగతం పలికారు. వేద మంత్రోచ్చారణల నడుమ టీటీడీ ఈఓ ధర్మారెడ్డి తలపాగా ధరించి సారె తీసుకుని ముక్కంటి ఆలయంలో సమర్పించారు. అనంతరం టీటీడీ ఈఓను గురుదక్షిణా మూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో బియ్యపు ఆకర్ష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ క్రమంలోనే శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయం తరపున ఈఓ పట్టువస్త్రాలు సమర్పించారు.



పట్టువస్త్రాలు అందిస్తున్న కాణిపాకం ఆలయ కమిటీ చైర్మన్, ఈఓ



విజయవాడ కనకదుర్గమ్మ సారె అందిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్



సారె సమర్పిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

వధూవరులకు తాళిబొట్లు



తాళిబొట్లు పంపిణీ చేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

రేణిగుంట: శివపార్వతుల కల్యాణోత్సవం సందర్భంగా పెండ్లిమండపం వద్ద ఒక్కటవుతున్న నూతన వధూవరులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి, తనయుడు ఆకర్ష్‌రెడ్డి బంగారు తాళిబొట్లు, పట్టు వస్త్రాలను అందించారు. వారు మాట్లాడుతూ దశాబ్దాల ఆనవాయితీ ప్రకారం కొత్త జంటలకు తాళిబొట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, స్థానిక నేతలు గుమ్మడి బాలకృష్ణయ్య, రాము గుప్తా, టైలర్ శ్రీను, హరి, వయ్యాల కృష్ణారెడ్డి లక్కమనేని కృష్ణ, నంద, మునిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నోటిఫికేషన్ విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నోటిఫికేషన్ విడుదలైందని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయశంకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 3 దశల్లో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ఉంటుందన్నారు. విద్యార్హత, శారీరక/వైద్య ప్రమాణాల వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. యానిమేటెడ్ వీడియోల రిజిస్టర్, దరఖాస్తు, పరీక్షకు ఎలా హాజరు కావాలి ? అనే వివరాలు కూడా పొందుపరిచారన్నారు. సందేహాలు ఉంటే www.ojinind-ianarmy. nic.in (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాయిన్‌ఇండియన్‌ఆర్మీ.ఎన్‌ఐసీ.ఇన్) వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. అడ్మిట్ కార్డ్ కలర్ ప్రింట్‌తో పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని సూచించారు.

అమోఘం.. అయోధ్యకాండ పారాయణం



తిరుమల: లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఆదివారం ఉదయం నిర్వహించిన 8వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం అమోఘంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. అయోధ్యకాండలోని 156 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 181 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేద పాఠశా ల పండితులు కె.రామానుజాచార్యులు, శ్రీ అనంత గోపాలకృష్ణ, మారుతి పారాయణం చేపట్టారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు శ్రీ శ్రీనివాస్ బృందం వారు కీర్తనలు ఆలపించారు.

నేడు టీటీడీ పాలకమండలి సమావేశం

తిరుమల: టీటీడీ పాలకమండలి సమావేశం సోమవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో జరగనుంది. ఉదయం 10 గంటలకు టీటీడీ చైర్మన్ భువన కరుణాకరరెడ్డి నేతృత్వంలో ఈ సమావేశం ప్రారంభం కానుంది. ఇందులో టీటీడీ పలు కీలకమైన నిర్ణయాలను ఆమోదించనుంది.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 68,446 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,549 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.24 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

ప్రత్యేక హోదా మాట మార్చారు



విగ్రహావిష్కరణలో మంత్రులు పెద్దిరెడ్డి, నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: జనసేన, బీజేపీ, టీడీపీ కలయికలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు.. పదేళ్లు.. 15 ఏళ్లు ఇస్తామని చెప్పి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, వెంకయ్యనాయుడు మాట మార్చారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం చిత్తూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. 2014లో మోదీ, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ప్రత్యేక హోదా విషయాన్ని అసలు పట్టించుకోలేదన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో కాపులకు మేలు

వైఎస్సార్‌సీపీ పాలనలోనే కాపులకు మేలుజరిగిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. నగరంలోని గంగినేని పార్కులో వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాయలవారి విగ్రహాన్ని మంత్రి పెద్దిరెడ్డి ఆవిష్కరించారు. ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం పెద్దిరెడ్డి మాట్లాడుతూ కాపు భవన నిర్మాణానికి రూ.50 లక్షలు విరాళంగా అందజేస్తానని తెలిపారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగనన్నే సీఎం అవుతారని స్పష్టం చేశారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వక్రబుద్ధి చూపించి చిత్తూరు అభివృద్ధిని అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వన్నెకుల క్షత్రియ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు విరాళంగా అందజేశారు. బలిజ సంఘం నాయకులు నందగోపాల్, రవినాయుడు, మధుసూదన్ రాయల్, వివేకానంద, అప్పాజీ హాజరయ్యారు.

అభివృద్ధికే పట్టం కట్టండి

పెనుమూరు(కార్వేటినగరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంత్రి మాట్లాడు తూ ఇచ్చిన హామీలను వందశాతం పూర్తిస్థాయిలో నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని, కుప్పంలో చంద్రబాబుకు ఓటమి తప్పదన్నారు.

మీకు ప్రజాబలం ఉంటే పొత్తులెందుకు ?

పలమనేరు/బైరెడ్డిపల్లి: మీకు ప్రజాబలం ఉంటే ఇన్ని పార్టీలతో పొత్తులెందుకని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. మండలంలో రూ.28 కోట్లతో నిర్మించిన మూడు రహదారులను మంత్రి ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ ఆసరా మెగా చెక్కులు పంపిణీ చేశారు. మండలంలో నిర్మించిన పలు నూతన రోడ్లను ప్రారంభించారు.ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. వినతులు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్పందనకు జిల్లాలోని అన్నిశాఖల ఉన్నతాధికారులు హాజరుకావాలని ఆదేశించారు.

కారులో తరలిస్తున్న నగదు, నగల పట్టివేత



స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసులు

చిల్లకూరు : మండలంలోని జాతీయ రహదారిపై ఆదివారం బూదనం టోల్‌ప్లాజా వద్ద చేపటిన తనిఖీల్లో కారులో తరలిస్తున్న రూ.64లక్షల నగదు, 113 గ్రాముల నగలు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. శ్రీకాకుళం నుంచి చెన్నైకు కారులో వెళుతున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రశీదు లేని సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వారిని విచారించగా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం, తమరపల్లెకు చెందిన తోట మణికంఠ, అదే మండలం శివనగర కాలనీకి చెందిన గిలివి మన్మథరావుగా తెలిసిందని, వారు ఆ ప్రాంతంలో బంగారు వ్యాపారం చేస్తుంటారని వివరించారు. అయితే రశీదులు లేకపోవడంతో సీజ్ చేసిన నగదు, నగలను ఆదాయపన్ను శాఖకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- తిరుపతి పెద్దకాపు లేఔట్లో గుర్తింపు
- గంటల వ్యవధిలోనే కేసు ఛేదించిన పోలీసులు



బాలుడిని అప్పగిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

తిరుపతి క్రైమ్ : తిరుమలలో ఓ బాలుడు కిడ్నాప్‌కు గురైన కేసును గంటల వ్యవధిలోనే ఛేదించినట్లు ఎస్పీ కృష్ణ కాంత్ పాటిల్ తెలిపారు. తెలంగాణలోని జోగులాంబ జిల్లాకు చెందిన నగేష్, కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం రైలులో రేణిగుంటకు వచ్చారు. అలిపిరి కాలినడక మార్గంలో తిరుమలకు చేరుకున్నారు. మహిళలు, పిల్లలు పీఏసీ-2లో సేదతీరుతుండగా, మిగిలినవారు వసతి గది కోసం సీఆర్‌ఓ కార్యాలయానికి వెళ్లారు. మహిళలు నిద్రపోవడంతో వారితో ఉన్న బాలుడు అభినయ్ (3) కనిపించకుండా పోయాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సీఐ జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్‌ఐలు శంకర్, సాయినాథ్ ఆధ్వర్యంలో దర్యాప్తు బృందాలు సీసీ ఫుటేజీ పరిశీలించి బాలుడిని ఓ మహిళ తీసుకెళ్లినట్లు గుర్తించింది. ఈ మేరకు తిరుపతి పెద్ద కాపు లేఔట్‌లోని ఓ ప్రైవేట్ లాడ్జిలో కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకుని బాలుడిని స్వాధీనం చేసుకుంది. నిందితురాలిని విచారించగా ఈస్ట్ గోదావరి జిల్లా, రాజానగరానికి చెందిన దేవిగా తేలింది. బెంగళూరు తీసుకెళ్లి బాలుడిని విక్రయించేందుకు కిడ్నాప్ చేసినట్లు పోలీసులు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ సమక్షంలో బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

వైభవంగా త్రిశూల స్నానం



కపిలతీర్థంలోని పుష్కరిణిలో త్రిశూల స్నానం నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన ఆదివారం ఉదయం కపిలతీర్థం పుష్కరిణిలో వైభవంగా త్రిశూల స్నానం నిర్వహించారు. అంతకు ముందు శ్రీనటరాజ స్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ దర్శనమిచ్చారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా త్రిశూల స్నానం జరిపించారు. శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆయుధమైన త్రిశూలానికి స్నపన తిరుమంజనం నిర్వహించి శాంతి చేకూర్చారు. పూర్ణాహుతి, కలశోద్వాసనం, మూల వర్లకు కలశాభిషేకం చేశారు. ఈ క్రమంలోనే సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు చేపట్టిన ధ్వజావరోహణంతో కపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. ఈ సందర్భంగా రాత్రి 8 నుంచి 10 గంటల వరకు రావణ వాహన సేవ వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

– మరొకరి పరిస్థితి విషమం

నాయుడుపేటటౌన్ : మండలంలోని మూర్తిరెడ్డిపాళెం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. నెల్లూరుకు చెందిన హేమంత్(17), వెంకటేష్(22), శ్రీకాళహస్తికి చెందిన బాలాజీ నెల్లూరులోని ఓ స్వీట్ దుకాణంలో పనిచేసేవారు. ఈ క్రమంలో పుత్తూరులో జరగనున్న బాలాజీ బంధువుల పెళ్లికి వెళ్లేందుకు ముగ్గురకూ బైక్‌పై బయలుదేరారు. మార్గం మధ్యలో వెనుక నుంచి ఓ లారీ తగలడంతో బైక్ అదుపు తప్పి ముందు వెళుతున్న మరో లారీ టైర్ల కింద పడిపోయారు. దీంతో హేమంత్, వెంకటేష్ అక్కడికక్కడే మరణించారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ గోపీ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన బాలాజీని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఆగకుండా వెళ్లిపోవడంతో ఆచూకీ తెలుసుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి



మృతి చెందిన వీరాస్వామి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ఎన్‌టీఆర్ నగర్ సమీపంలోని కేటీరోడ్డుపై ఆదివారం ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. వరదయ్యపాళెం మండలం కడూరు గ్రామానికి చెందిన వీరాస్వామి అనే వృద్ధుడు నడిచి వెళుతుండగా, బుచ్చినాయుడు కండ్రిగకు చెందిన శ్రీ సిటీ ఉద్యోగి బాలాజీ స్కూటర్‌పై వెళుతూ ఢీకొన్నాడు. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించగా వీరాస్వామి మరణించాడు. బాలాజీని మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటనరసింహం తెలిపారు.